GHMC hmda Growing Global TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595


# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

శనివారం 10-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్





నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గజలాపురం వ్యవసాయ బోర్ల వివాదం చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదానికి సంబంధించి ఎస్ఐ పంగ సురేష్ యాదవ్ వ్యవహారశైలిపై బాధితులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో, అసలు ఏం జరిగింది? పోలీసుల వైఖరి ఏమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**మాడ్గులపల్లి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:**

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అధికార దుర్వినియోగం

- అర్హులకు అన్యాయం కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యం
- కాగితాలకే పరిమితమైన నిబంధనలు
- కాంగ్రెసేతర ?సర్పంచులు, ఇందిరమ్మ కమిటీల జాబితాల బుట్టదాఖలు
- ప్రజల డబ్బుతో రాజకీయాలా? కాంగ్రెస్ కండువా కప్పితేనే ఇళ్లా?
- పారదర్శకత లోపించిన ఎంపిక విధానం
- పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం అధికార దుర్వినియోగం పై న్యాయపోరాటం
- విలేకరుల సమావేశంలో సిపిఐ ( ఎం ) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

2లో



# రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి**



**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09:** నియోజకవర్గంలోని రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ అధికారితో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరించారు. ప్రస్తుతం రోజుకు 6 నుంచి 7 గంటలే విద్యుత్ సరఫరా అవుతుండటంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

# బోర్ల వివాదంలో మాడ్గులపల్లి ఎస్ఐ పై ఆరోపణలు...!

**బాధితుల ఆరోపణలు ఏమిటి...?**

వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన గార్లపాటి పుష్పలతకు గజలాపురం శివారులోని సర్వే నంబర్ 86లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, రెండు బోర్లు ఉన్నాయని పేర్కొన్నారు. పక్క పొలం రైతుతో తలెత్తిన వివాదంలో తన పొలంలోని మోటారు, పైపులు ధ్వంసమయ్యాయని పుష్పలత ఆరోపించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తన ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోలేదని, పైగా తనతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారని బాధితురాలు ఆరోపిస్తున్నట్లు ప్రచారంలో ఉన్న వార్తల్లో పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలు, కేసు పత్రాలు, ఇరు వర్గాల వాదనలు స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

**ఎఫ్ఐఆర్ (FIR) నమోదైందా...?**

ఈ ఘటనకు సంబంధించి వార్తల్లో పేర్కొన్న అంశాలపై మాడ్గులపల్లి ఎస్ఐ పంగ సురేష్ యాదవ్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన ఫోన్ కాల్‌కు స్పందించలేదు. అనంతరం పంపిన సందేశంలో ఈ వార్త 'ఫేక్ న్యూస్' అని పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు, ఇదే విషయమై పోలీస్ స్టేషన్ సిబ్బందిని సంప్రదించగా, ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ (FIR) నమోదైన విషయం వాస్తవమేనని, 06-08-2026న కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. అయితే ఎఫ్ఐఆర్ (FIR) నమోదు కావడం, అందులోని ఆరోపణలు నిజమని తేలడం రెండూ వేర్వేరు అంశాలు. కేసు నంబర్, వర్తింపజేసిన చట్టపరమైన సెక్షన్లు, ఫిర్యాదులోని వివరాలను అధికారిక పత్రాల ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

**బాధితుల స్పందన కోసం ప్రయత్నం..!**

ఈ వ్యవహారంలో ఫిర్యాదుదారులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ, వారు కూడా ఫోన్ కాల్స్‌కు స్పందించలేదు. దీంతో వారి తాజా వాదనను స్వతంత్రంగా నిర్ధారించేందుకు అవకాశం లేకుండా పోయింది.

**విచారణపై స్పష్టత ఎప్పుడు?**

వాట్సాప్‌లో ప్రచారంలో ఉన్న సమాచారంలో నల్లగొండ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు, స్పెషల్ బ్రాంచ్ విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ రెండు అంశాలపై అధికారిక ధృవీకరణ లభించాల్సి ఉంది. విచారణకు నిజంగా ఆదేశాలు జారీ అయ్యాయా? ఎస్ఐపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవమెంత? కేసు నమోదు వెనుక ఉన్న పరిస్థితులేమిటి? అనే అంశాలపై సంబంధిత అధికారుల వివరణతోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీసు వ్యవస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు, వాటిని పారదర్శకంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించడం కీలకం. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవ పరిస్థితులను స్పష్టం చేయాలని స్థానికంగా చర్చ జరుగుతోంది.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అధికార దుర్వినియోగం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కేటాయింపుల్లో జిల్లా వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో అధికార దుర్వినియోగం, రాజకీయ వివక్ష జరుగుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించకుండా, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ జెండా కప్పుకున్న వారికే ప్రాధాన్యమిస్తూ ఇళ్లను మంజూరు చేస్తున్నారని, ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెసేతర పార్టీల సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు నిబంధనల ప్రకారం సిద్ధం చేసి ఇచ్చిన అర్హులైన నిరుపేదల జాబితాలను అధికారులు, మంత్రులు పూర్తిగా బుట్టదాఖలు చేస్తున్నారని ఆధారాలతో సహా వెల్లడించారు. ఈ అన్యాయంపై అధికారులు, ప్రభుత్వం వెంటనే తమ తీరు మార్చుకోకపోతే జిల్లా వ్యాప్తంగా బాధితులైన పేదలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని, అవసరమైతే కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేసి పేదలకు ఇళ్లు దక్కేలా చూస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ప్రతీ నిరుపేద కుటుంబానికి నీడ కల్పిస్తామని హామీ ఇచ్చిందని నున్నా నాగేశ్వరరావు గుర్తుచేశారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లు ప్రకటిస్తూ, అర్హుల ఎంపిక కోసం ఎల్-1, ఎల్-2, ఎల్-3 వర్గీకరణను రూపొందించారని తెలిపారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారిని, రేకుల ఇళ్లు లేదా చిన్న గుడిసెలలో నివాసముంటున్న అత్యంత నిరుపేదలను మొదటగా ఆదుకుంటామని ప్రకటించారన్నారు. దీని ప్రకారం ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను మొదటి పేజ్‌లో 16,872 ఇళ్లు, రెండో పేజ్‌లో 10,400 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. అయితే ఆచరణలోకి వచ్చేసరికి ప్రభుత్వం చెప్పిన నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నాయకుల ఇష్టారాజ్యమే నడుస్తోందని విమర్శించారు. గ్రామాల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా, గ్రామాభివృద్ధిని కాంక్షించే గ్రామ సర్పంచ్ చైర్మన్‌గా ఉండే ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన ఆమోదిత జాబితాల ప్రకారమే ఇళ్లు కేటాయించాలని నిబంధనలు చెప్తున్నాయని నాగేశ్వరరావు పేర్కొన్నారు. కానీ జిల్లాలో కాంగ్రెసేతర సర్పంచులు ఉన్న గ్రామాల్లో వారిని పూర్తిగా పక్కనబెట్టి, వారి ఇచ్చిన లిస్టులను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదని ఆరోపించారు. మంత్రులు కూడా ఇతర పార్టీల సర్పంచులు ఇచ్చిన అర్హుల జాబితాలను పట్టించుకోకుండా, కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన జాబితాలకే ఇళ్లను మంజూరు చేస్తూ తీవ్ర వివక్ష చూపిస్తున్నారని మండిపడ్డారు. ఉదాహరణకు తిరుమలాయపాలెం తదితర ప్రాంతాల్లో సర్పంచులు నిబంధనల ప్రకారం అత్యంత అర్హులైన పేదల పేర్లతో జాబితా ఇస్తే, అందులో ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. కొన్ని గ్రామాల్లో ఎల్-1 కేటగిరీలో అర్హులైన నిరుపేదలు ఉన్నప్పటికీ, వారికి ఇవ్వకుండా రాజకీయ ఒత్తిళ్లతో ఎల్-2, ఎల్-3 లో ఉన్న కాంగ్రెస్ నాయకుల అనుచరులకే కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు సమయంలో గ్రామసభలు నిర్వహించి, అర్హులైన పేదలందరినీ గుర్తించి, పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా ఇళ్లను ఎంపిక చేశారని ఆయన గుర్తుచేశారు. దానివల్ల ఎలాంటి వివాదాలు లేకుండా అర్హులకు ఇళ్లు దక్కాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అటువంటి పారదర్శక విధానాన్ని అమలు చేయాలని లేదా గ్రామసభలు, సర్పంచుల కమిటీ నిర్ణయించిన జాబితాల ప్రకారం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను కాపాడాల్సిన అధికారులే అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి చట్టాన్ని ఉల్లంఘిస్తే, వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునేలా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ అధికార దుర్వినియోగం, అక్రమాలపై త్వరలోనే సీపీఎం ప్రతినిధి బృందం, బాధితులైన ప్రజాప్రతినిధులతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివక్షను ఆధారాలతో సహా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే విచారణ జరిపించి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ఒకవేళ జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా ఇదే రకమైన వైఖరిని కొనసాగిస్తే, బాధితులైన నిరుపేదలందరినీ ఏకం చేసి కలెక్టరేట్ ముట్టడితో పాటు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, అలాగే కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేసి పేదల హక్కులను కాపాడతామని నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

**అడ్డగుట్ట :** విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడికి యత్నించిన పాత నేరస్తుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్ వివరాల ప్రకారం.. ఈ నెల 7న సాయంత్రం కుమార్ తన బైక్‌పై షెనాయ్ ఎక్స్ రోడ్డు వైపు వెళ్తుండగా గంగా జమున హోటల్ వద్ద ట్రాఫిక్‌లో ఆగాడు. అదే సమయంలో ఆటోడ్రైవర్ శ్రావణ్ అలియాస్ తుఫాన్ శ్రావణ్(24) తన ఆటోతో ఎడమవైపు నుంచి ఓవర్ టెక్ చేసి బైక్‌ను అడ్డంగా పెట్టి దుర్భాషలాడాడు. కుమార్ పట్టించుకోకుండా వెళ్తుండడంతో కత్తితో శ్రావణ్ అతడిని వెంబడించాడు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు రాము, సంజయ్ అడ్డుకోగా పెనుగులాటలో నిందితుడు శ్రావణ్ కత్తితో దాడి చేయడంతో కానిస్టేబుల్ రాము కుడిచేతి బొటనవేలికి గాయమైంది. దీంతో శ్రావణ్ అక్కడి నుంచి పారిపోయాడు. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సుభాష్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీల్లో అదే ఆటోలో వెళ్తున్న శ్రావణ్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి కత్తి స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే అతడిపై ఐదు కేసులు ఉండడంతో పాత నేరస్తుడని తేలింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# పెండ్లి చేసుకోమన్నందుకే ప్రియురాలి హత్య

**మహిళ హత్య కేసు ఛేదించిన పోలీసులు**

వెంగళరావునగర్, గత నెల అమీర్‌పేట డీకే రోడ్డులోని గోకుల్ ఫ్రైడ్ హోటల్‌లో జరిగిన మహిళ హత్య కేసును ఎస్ఆర్‌నగర్ పోలీసులు ఛేదించారు. మహిళను రాడ్డుతో తీవ్రంగా కొట్టి ఆమె మృతి చెందడంతో పరారైన ఆమె ప్రియుడు ఆవుసపల్లి శ్రీనివాస్ (38)ను నగరంలోని సీబీఎస్ వద్ద పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం, నాగసముద్రం గ్రామానికి చెందిన బి. శిరీష (34) ఎస్బీఐ కస్టమర్ సర్వీస్‌పాయింట్‌ను నిర్వహిస్తుండేది. ఆమెతో వికారాబాద్ జిల్లా తాండూరు సమీపంలోని పెద్దేముల ఓగులాపూర్‌కు చెందిన శ్రీనివాస్ పరిచయం పెంచుకున్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శిరీష వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు కూడా తీసుకున్నాడు. ఈ క్రమంలో శిరీషను గత నెల గోకుల్ ఫ్రైడ్ హోటల్‌కు తీసుకొని వచ్చి 103 గదిలో బస చేశాడు. అయితే హోటల్ బుక్ చేసే సమయంలో తప్పుడు గుర్తింపు కార్డులను హోటల్ సిబ్బందికి అందజేశాడు. గదిలో ఉన్న సమయంలో తనను పెండ్లి చేసుకోవాలని శిరీష ఒత్తిడి చేయడంతో గదిలోని కర్టెన్ రాడ్డుతో ఆమెను విచక్షణా రహితంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం శిరీషకు సంబంధించిన రూ.4లక్షల నగదు, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసుకొని బయట నుంచి తాళం వేసి పరారయ్యాడు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలించారు. గురువారం ఉదయం అఫ్జల్ గంజ్ సీబీఎస్ వద్ద శ్రీనివాస్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ. 1.30లక్షల నగదు, 7.996 గ్రాముల బంగారు గోలుసు, ఒక గ్రాము ఉంగరం, ఆమెకు చెందిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆవుసపల్లి శ్రీనివాస్ ప్రేమ పేరిట మహిళలను మభ్యపెట్టి వారితో శారీరకంగా కలిసి, ఆపై డబ్బు తీసుకొని పరారయ్యేవాడని పోలీసుల విచారణ వెల్లడైంది. మహిళలను వేధించినట్లుగా వివిధ పోలీసు స్టేషన్లలో ఆరు కేసులు నమోదయ్యాయి. మొయినాబాద్‌లో రెండు, బోరబండలో ఒకటి, ఇతర ప్రాంతాల్లో మరో మూడు కేసులున్నట్లు గుర్తించారు. ప్రేమ పేరిట మహిళలను మోసం చేసి, వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు తీసుకొని జల్సాలు చేయడం శ్రీనివాస్‌కు అలవాటు. అయితే శిరీష పెండ్లి చేసుకోమని పట్టుబట్టినందుకే ఆమెను అంతమొందించాడు.




## పండుగలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలి

### సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్

### బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ పాలకూరి రమాదేవి

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి-నరసింహ గౌడ్ హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలసి రమాదేవి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు, పూల పండుగ బతుకమ్మ ప్రతిరూపమని కొనియాడారు. విద్యార్థులంతా పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ,బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా చేపడుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను సర్పంచ్ స్వయంగా పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో నేనావత్ చందర్ నాయక్ మృతి..

### బాధిత కుటుంబానికి నాయకుల ఆర్థిక సాయం

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** మండల పరిధిలోని గానుగుమర్ల తండా గ్రామ పంచాయతీకి చెందిన నేనావత్ చందర్ నాయక్ ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. చందర్ నాయక్ అకాల మరణంతో గానుగుమర్ల తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, తండావాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత జర్పుల దశరథ్ నాయక్, స్థానిక సర్పంచ్ సేవ్యా నాయక్ మృతుడి నివాసానికి చేరుకున్నారు. చందర్ నాయక్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున జర్పుల దశరథ్ నాయక్ రూ.5,000 ఆర్థిక సాయం అందించగా, స్థానిక సర్పంచ్ సేవ్యా నాయక్ రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు..ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీను నాయక్, రాజు నాయక్, చాంది లక్ష్మణ్ నాయక్, నాగార్జున నాయక్, గోపి, మాజీ ఉపసర్పంచ్ పాండు, మాజీ వార్డు సభ్యుడు శంకర్ నాయక్‌తో పాటు నాయకులు కిషన్ నాయక్, హరి, హరియా, బద్య, శీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ సంబరాలకు నూనెగూడెం సిద్ధం!

### మహిళల సౌకర్యం కోసం ఈరసరపు యాదగిరి గౌడ్ సొంత ఖర్చులతో మట్టి పనులు

### ప్రాంగణాన్ని బాగుచేయించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు.. కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** బతుకమ్మ పండుగ వేళ మహిళలకు సౌకర్యాలు కల్పించేలా నూనెగూడెం గ్రామంలో బతుకమ్మ ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో మహిళలు బతుకమ్మ ఆడే స్థలంలో మట్టిని పోయించి, ప్రాంగణాన్ని బాగుచేసే పనులు చేపట్టారు. మహిళలు పండుగను సంతోషంగా జరుపుకునే సమయంలో ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్ తన సొంత ఖర్చులతో ఈ పనులు చేయించినట్లు గ్రామ నాయకులు తెలిపారు.



**"మహిళల సౌకర్యానికి ప్రాధాన్యం"**

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో మహిళలు ఒకచోట చేరి బతుకమ్మ ఆడేందుకు అనువుగా ప్రాంగణాన్ని సిద్ధం చేయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మట్టి పనులు చేపట్టడంతో బతుకమ్మ ఆడే స్థలం మరింత అనుకూలంగా మారిందని గ్రామ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈరసరపు యాదగిరికి గ్రామ ప్రజలు, నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా, డాక్టర్ వెంకన్న, నూనెగూడెం గ్రామ సర్పంచ్ మద్దెపురం కొండమ్మ పరశురాములు, ఉప సర్పంచ్ అండెం ప్రశాంత్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు గన్న సురేందర్ రెడ్డి, గుండాల సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య, గుండాల గ్రామ శాఖ అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు ఋషిగంపల అనూష, సంతోష, లావణ్య, సాయి చందన, మద్దెపురం రాజు, తూణం సతీష్, జిట్ట మల్లేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ఘనంగా పోషణ మాసోత్సవాలు

### చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం

### కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి కడ్తాల్:** చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని కడ్తాల్ గ్రామ సర్పంచ్ బిక్షపతి పేర్కొన్నారు. చిన్నారులకు బాల్యం నుంచే పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బాటలు వేయవచ్చని తెలిపారు. శుక్రవారం కడ్తాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బిక్షపతి అధ్యక్షతన, ఐసీడీఎస్ సూపర్వైజర్ హరిప్రియ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిక్షపతి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఘనంగా అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు....**

పోషణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం,



ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడం, పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజి, వార్డు సభ్యులు విజయ్ కుమార్, కళ్యాణ్ కార్ భాను కిరణ్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, మల్లయ్య, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజకీయ ఉనికి కోసం కాంగ్రెస్ చౌకబారు డ్రామాలు

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** రాజకీయ ఉనికి కోసం చౌకబారు డ్రామాలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్ నేతలను బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు.. కేంద్ర ఎన్నికల సంఘం ఈసీఐ నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లను తొలగించి పారదర్శకత తీసుకురావడానికి చట్టబద్ధంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం సిగ్గు చేటు అని అన్నారు.నరేంద్ర మోదీ పై కేంద్ర ప్రభుత్వం పై బురద చల్లడానికి కాంగ్రెస్ నేతల ధర్నాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.



# కనుమరుగవుతున్న ఉత్తరాల జ్ఞాపకాలకు పునర్జీవం!

**రామారం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం**

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** సాంకేతిక విప్లవం వేగంగా దూసుకెళ్తున్న ప్రస్తుత కాలంలో ఒకప్పుడు మనుషుల మధ్య అనుబంధాలను పెంచిన ఉత్తరాలు, పోస్ట్ బాక్సులు, మనీ ఆర్డర్లు, పోస్ట్‌మెన్ సేవలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అలనాటి తపాలా వ్యవస్థ ప్రాముఖ్యతను, ఆ సేవల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ తపాలా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తపాలా వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య సమాచారాన్ని చేరవేయడంలో ఉత్తరాలు కీలక పాత్ర పోషించేవని గుర్తుచేశారు. ఆత్మీయతను పంచిన ఉత్తరాలు, గ్రామీణ ప్రజలకు ఆర్థిక లావాదేవీల్లో తోడ్పడిన మనీ ఆర్డర్లు, ప్రజలకు సందేశాలను చేరవేసిన పోస్ట్‌మెన్‌ల సేవలు సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి



రావడంతో సంప్రదాయ తపాలా సేవల వినియోగం తగ్గుతున్న నేపథ్యంలో, వాటి చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమం ద్వారా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు. సునీల్ కుమార్, ఉపాధ్యాయులు ఎం. సుధాకర్, శ్రావణి, ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండాలలో బతుకమ్మ సంబరాల సందడి.. తెలంగాణ సంస్కృతికి విద్యార్థుల జేజేలు!

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వేడుకలు.. పూల పండుగతో మార్మోగిన పాఠశాల ప్రాంగణం!**

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-**తెలంగాణ సంస్కృతి వైభవం.. పూల పండుగ సందడి.. విద్యార్థుల ఉత్సాహం! గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ పాటలతో విద్యార్థుల సందడి.. ఉత్సాహభరిత వాతావరణం మధ్య వేడుకలు కన్నులపండువగా సాగాయి. విద్యార్థులు బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తమ వేడుకల ద్వారా చాటిచెప్పారు.

**"విద్యతో పాటు సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ"!**

నేటి తరానికి తెలంగాణ పండుగల విశిష్టతను పరిచయం చేయడంలో భాగంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం,



ఐక్యతాభావం, సామాజిక స్పృహను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, నరసమ్మ, రవి, బాలరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ.. విద్యతో పాటు సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ.. విద్యార్థుల్లో మన వారసత్వంపై గౌరవాన్ని పెంపొందించేందుకు పాఠశాల కృషి చేస్తోందని ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ తెలిపారు.

# మృతుడు చందర్ నాయక్ కుటుంబానికి అండగా జర్పుల లక్పతి నాయక్

**రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):**అనారోగ్యంతో మృతి చెందిన నేనావత్ చందర్ నాయక్ కుటుంబానికి సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు, జర్పుల జాగ్రం భగత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్ అండగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని గానుగుమర్ల తండా గ్రామపంచాయతీకి చెందిన నేనావత్ చందర్ నాయక్ శుక్రవారం ఉదయం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జర్పుల లక్పతి నాయక్ గానుగుమర్ల తండాకు చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు..ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, బాధితులకు తోడ్పాటు అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తూ జర్పుల లక్పతి నాయక్ ఆర్థిక సాయం అందించడం పట్ల స్థానికులు



హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి బిక్యా నాయక్, రంగారెడ్డి జిల్లా సేవాలాల్ సేన వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునవత్ రాజు నాయక్, గ్రామ నాయకులు భీమన్ నాయక్, పాండు నాయక్, దేశ్య నాయక్, శ్రీనుతో పాటు పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి అండగా జక్కుల చిన్న జంగయ్య యాదవ్

**బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(వెల్దండ):** వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ అంకమనుకుంట తండాకు చెందిన మొక్కరాల బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న జియాగూడ యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ స్పందించి, మృతురాలి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా జక్కుల చిన్న జంగయ్య యాదవ్ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించి, జంగన్న యువసేన సభ్యుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం, బాధితులకు తన వంతు సహాయం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జంగన్న యువసేన సభ్యులు ఆలే నరేష్ యాదవ్, నాగిల్ల సాయిరాం, జంగయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రాపురంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రాపురం, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రామచంద్రాపురంలోని వి. గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు, మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.








# సావిత్రిబాయి పూలే కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలను కల్వకుర్తి పట్టణంలోని సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలను తీసుకొచ్చి అందంగా బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, బొడ్డెమ్మలతో కలిసి ఉత్సాహంగా ఆటపాటల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థినుల ఆటపాటలు, సందడి మధ్య ఉత్సవాలు ఆనందోత్సాహాలతో సాగాయి. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ.. బతుకమ్మలోని రంగురంగుల పూలు మన జీవితంలోని విభిన్న అనుభవాలకు ప్రతీకలని, జీవితంలో ఎన్ని కష్టసుఖాలు ఎదురైనా ధైర్యంగా నిలబడాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమకంటూ ప్రత్యేక భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. విద్యార్థినుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఐక్యత, సంతోషం, ప్రకృతి పట్ల ప్రేమను చాటిచెప్పేలా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# వాహన పత్రాలు లభ్యమైతే సమాచారం ఇవ్వగలరు.



**బొంరాస్‌పేట్ (క్రైమ్ మిర్రర్) :** వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలం ఎరుపుమల్ల గ్రామానికి చెందిన బోయిని శ్రీను అనే వ్యక్తి తన ఆటోలకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను గత నెల 29 తారీకు పోగొట్టుకున్నట్లు తెలిపారు.ఝా 34 ఎదీ 4934 మరియు ఝా 34 ఎ 9306 రిజిస్ట్రేషన్ నంబర్లు కలిగిన ఆటోల ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు (ఆర్ సి ), పర్మిట్, ఎన్ ఓ సి సర్టిఫికెట్లు తుంకిమెట్ల గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ జారిపడిపోయాయి. పత్రాలు ఎవరికైనా లభిస్తే మానవత్వంతో 9666728278 ఫోన్ నంబర్‌కు సంప్రదించి సమాచారం అందించాల్సిందిగా బాధితుడు కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 'ముందస్తు బతుకమ్మ' వేడుకలు..!!

## సూరారం, అంబట్‌పల్లి పాఠశాలల్లో అంబరాన్నంటిన సంబరాలు

## ఆటపాటలతో సందడి చేసిన చిన్నారులు

## సంప్రదాయ పండుగకు చిన్నారుల ఘన స్వాగతం





**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందడి ప్రభుత్వ పాఠశాలల్లో ముందుగానే మొదలైంది. పూల పండుగను పురస్కరించుకుని సూరారం గ్రామంలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలతో పాటు అంబట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చిన్నారులు ఆటపాటలతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.

### సూరారం పాఠశాలల్లో సందడే సందడి..!!

సూరారం గ్రామంలోని ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల ఆటపాటలు, ఉత్సాహభరితమైన సందడితో పాఠశాల ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెబుతూ విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతిని ప్రతిబింబించే పండుగలను పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు అవకాశం కలుగుతుంది.

### అంబట్‌పల్లి పాఠశాలలో అంబరాన్నంటిన సంబరాలు..!!

అంబట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలోనూ ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు, విద్యార్థుల కోలాహలం, సంప్రదాయ ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పండుగ ప్రత్యేకతను చాటిచెప్పారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థులకు పరిచయం చేస్తూ నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంప్రదాయ పూల పండుగను చిన్నారుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకోవడం పాఠశాలల్లో పండుగ వాతావరణాన్ని నింపింది.

### సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట..!!

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసే అవకాశం కలుగుతుంది. చిన్నారులు చదువుతో పాటు కళలు, సంప్రదాయాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి. సూరారం, అంబట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఆటపాటలు, పూల అలంకరణలతో సాగిన ఈ సంబరాలు పాఠశాల ప్రాంగణాల్లో పండుగ సందడిని తీసుకొచ్చాయి.

# పూల పండుగ.. సంస్కృతి సోయగం..!!

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- ముఖ్య అతిథులుగా సర్పంచ్, ఉప సర్పంచ్
- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి
- ఆటపాటలతో కళాశాలలో పండుగ శోభ

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** రంగురంగుల పూల అందాలు.. సంప్రదాయ పాటల సందళ్లు.. కోలాటాల కోలాహలం.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ప్రకృతిని ఆరాధిస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగను కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయాల గొప్పతనాన్ని చాటారు.

### సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సర్పంచ్ హసినా భాను అక్బర్ ఖాన్, ఉప సర్పంచ్ శ్రీజా సంతోష్ హాజరై విద్యార్థినులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ హసినా భాను మాట్లాడుతూ.. ప్రకృతిని పూజించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతికి ఇది ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థినులు విద్యలో రాణించడంతోపాటు మన సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

### మహిళల ఐక్యతకు చిహ్నం..!!

ఉప సర్పంచ్ శ్రీజా సంతోష్ మాట్లాడుతూ.. మహిళలంతా ఒక్కటై ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే బతుకమ్మ పండుగ ఐక్యతకు, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. విద్యార్థినుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేలా కళాశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. కోలాటాలతో సందడి చేస్తూ వేడుకలకు మరింత కళ తీసుకొచ్చారు. పూల పరిమళాలు, జానపద గీతాలు, విద్యార్థినుల ఉత్సాహంతో కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి, ఒకరికొకరు ప్రసాదాలు పంచుకుంటూ వేడుకలను ఆనందంగా ముగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.





# పూల సింగిడితో మార్మోగిన శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల

### సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల బతుకమ్మ ఆటపాటలు

**(మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్) :** మహేశ్వరం మండలం రావిరాలలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చిన్నారులు స్వయంగా తయారు చేసుకున్న రంగురంగుల బతుకమ్మలతో ఆటపాటలు నిర్వహించారు. పాఠశాల ఆవరణ మొత్తం పూలతో, బతుకమ్మ పాటలతో మార్మోగిపోయింది. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ “బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో” అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ విశిష్టతను,తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బతుకమ్మలతో.. పాఠశాల ప్రాంగణం కళకళ!

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే పండుగల విశిష్టతను తెలుసుకోవడంతోపాటు, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ గుత్తా గోపాల్‌రెడ్డి కవిత మాట్లాడుతూ.. విద్యతోపాటు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థినులకు తెలియజేస్తూ, మన సంప్రదాయాలను కాపాడుకోవాలనే భావనను వారిలో పెంపొందిస్తున్నామన్నారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకల్లో సందడి చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉయ్యాల రమేష్ మరియు అధ్యాపక బృందం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడమే నిజమైన మానవ సేవ: జరుపుల దశరథ్ నాయక్

### జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదానం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** సమాజ సేవలోనే నిజమైన సంతృప్తి ఉందని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే మానవత్వానికి నిదర్శనమని కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో శుక్రవారం ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కేంద్రంలో నిరుపేదలకు, బాటసారులకు, కూలీలకు ఆప్యాయంగా భోజనం వడ్డించారు. ఆకలితో వచ్చిన ప్రతి ఒక్కరికీ భోజనం అందించాలనే లక్ష్యంతో ట్రస్ట్ ద్వారా నిత్య అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

**కుమారుడి జ్ఞాపకార్థం నిత్య అన్నదానం....**

తన దివంగత కుమారుడు జర్పుల రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఎండ, వాన అనే తేడా లేకుండా ప్రతిరోజూ అన్నదానం కొనసాగిస్తూ ఎంతోమంది ఆకలి తీర్చేందుకు కృషి చేస్తున్నారు. వందలాది మంది నిరుపేదలు, కూలీలు, బాటసారులకు ఈ కార్యక్రమం ద్వారా భోజనం అందుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు అండ...**

ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. పదవుల్లో ఉన్నా, లేకపోయినా ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ జర్పుల దశరథ్ నాయక్ తన కుమారుడి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. సమాజంలో ఎవరూ ఆకలితో ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో ఆయన చేస్తున్న సేవలు పలువురికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. నిత్య అన్నదానంతో పాటు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా ట్రస్ట్ ప్రజలకు అండగా నిలుస్తోందని స్థానికులు తెలిపారు. సేవాభావంతో చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సాటి మనిషి పట్ల ఆప్యాయతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.

# బంజారా థీమ్‌తో బతుకమ్మ సంబరాలు

**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో బంజారా థీమ్‌తో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ కార్యక్రమానికి శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్, కుమార్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంతోపాటు మన సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక: శ్వేత పాండురంగరెడ్డి. అన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగరెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ



ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. బంజారా థీమ్‌తో బతుకమ్మ సంబరాలను నిర్వహించడం వివిధ సంస్కృతుల ప్రత్యేకతను చాటిచెబుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తెలుసుకొని భావితరాలకు వాటిని అందించాలని ఆకాంక్షించారు. బంజారా సంస్కృతిని ప్రతిబింబించే థీమ్‌తో నిర్వహించిన ఈ వేడుకల్లో బతుకమ్మ పాటలు, పండుగ సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా జరిగిన ఈ సంబరాలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జింకల భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించిన శానంపూడి సైదిరెడ్డి

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల :** మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు జింకల భాస్కర్ తండ్రి జింకల పిచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని శుక్రవారం నేరేడుచర్ల లో బీజేపీ ఎన్నారై సెల్ రాష్ట్ర ఇంచార్జి హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.



# గుండాలలో బతుకమ్మ సంబరాల సందడి.. తెలంగాణ సంస్కృతికి విద్యార్థుల జేజేలు!

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వేడుకలు.. పూల పండుగతో మార్మోగిన పాఠశాల ప్రాంగణం!



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :- తెలంగాణ సంస్కృతి వైభవం.. పూల పండుగ సందడి.. విద్యార్థుల ఉత్సాహం! గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ పాటలతో విద్యార్థుల సందడి.. ఉత్సాహభరిత వాతావరణం మధ్య వేడుకలు కన్నులపండువగా సాగాయి. విద్యార్థులు బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తమ వేడుకల ద్వారా చాటిచెప్పారు.

**"విద్యతో పాటు సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ"!**

నేటి తరానికి తెలంగాణ పండుగల విశిష్టతను పరిచయం చేయడంలో భాగంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతాభావం, సామాజిక స్పృహను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, నరసమ్మ, రవి, బాలరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ.. విద్యతో పాటు సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ.. విద్యార్థుల్లో మన వారసత్వంపై గౌరవాన్ని పెంపొందించేందుకు పాఠశాల కృషి చేస్తోందని ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ తెలిపారు.

# టిఆర్ఎస్ పార్టీ లో చేరిన ఎంసీపీఐ (యు)నాయకులు



క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ కు చెందిన గూడా లావణ్య, గూడ శ్రీనివాస్ మరియు సీపీఎం, ఎం సి పి ఐ ( యు) పార్టీల నుండి తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీ లో చేరారు. వీరి చేరికతో స్థానిక రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామం ఏర్పడిందని. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి మరియు క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను విస్తరించడానికి ఇటువంటి చేరికలు దోహదపడతాయని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తెలిపాడు. ముందు ముందు మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన తెలిపాడు. పార్టీలో కష్టపడి ప్రత్యేక గుర్తింపు, సేవలు కొనసాగిస్తామని చేరిన నాయకులు పేర్కొన్నారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కి పాటు పడతామని తెలిపారు.

# ఏఐ ఏజెంట్ టెక్నాలజీపై ఐఐటీ హైదరాబాద్ శిక్షణ

నాలుగు వారాల ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్

అక్టోబర్ బ్యాచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలనుకునే వృత్తి నిపుణుల కోసం ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అప్లైడ్ ఏఐ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ అక్టోబర్ బ్యాచ్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. నాలుగు వారాల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఏఐ ఏజెంట్ సిస్టమ్స్ రూపకల్పన, అభివృద్ధి, అమలు వంటి అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించనున్నారు.

**ప్రాజెక్టుల ఆధారంగా శిక్షణ**

'నేర్చుకోండి.. ఆచరించండి.. అభివృద్ధి చేయండి' అనే విధానంతో రూపొందించిన ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ప్రొడక్షన్ స్థాయిలో పనిచేసే ఏఐ ఏజెంట్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తారు. టూల్స్ వినియోగం, రిట్రీవల్ ఆగ్మెంటెడ్ జనరేషన్ (ఆర్ఏజీ), మెమరీ, ఆర్కెస్ట్రేషన్, మల్టీ-ఏజెంట్ సిస్టమ్స్, అబ్జర్వబిలిటీ, మూల్యాంకనం, భద్రతా నియంత్రణలు, డిప్లాయ్‌మెంట్ వంటి కీలక అంశాలపై శిక్షణ ఇస్తారు. ఇన్‌స్ట్రక్టర్ల ఆధ్వర్యంలోని సెషన్లు, ప్రాక్టికల్ ల్యాబ్‌లు, ఆన్‌లైన్ అభ్యాసం, మెంటరింగ్‌తో పాటు ప్రాజెక్టుల అభివృద్ధికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమం ముగింపులో ప్రాజెక్టుల ప్రదర్శన, ఫీడ్‌బ్యాక్ నిర్వహిస్తారు. నిర్దేశించిన ల్యాబ్‌లు, అసెస్‌మెంట్‌లు, ఇతర అవసరాలను పూర్తి చేసిన వారికి ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ అందజేస్తారు.

**నిపుణుల పర్యవేక్షణలో కార్యక్రమం**

ఐఐటీ హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ప్రవీణ్ తమ్మన, డాక్టర్ ఆశిష్ మిశ్రా, డాక్టర్ అనుపమ్ సంఘీ, డాక్టర్ అభిజిత్ దాస్‌తో పాటు పరిశ్రమ నిపుణుడు, ఏఐ సొల్యూషన్ ఆర్కిటెక్ట్ ఎన్.వి.ఎస్.ఎన్. కౌండిన్య ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించనున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న బ్యాచ్‌కు వివిధ పరిశ్రమలకు చెందిన వృత్తి నిపుణుల నుంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ బ్యాచ్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల అభ్యర్థన మేరకు కార్పొరేట్, గ్రూప్ డిస్కౌంట్లు కూడా అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

**రిజిస్ట్రేషన్ వివరాలు**

ఆసక్తి గల అభ్యర్థులు ఐఐటీ హైదరాబాద్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కార్యక్రమ వివరాలను తెలుసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం ఖఅశ్రీఖఐఅఎప్రజాఖుsఎపింవ.అణష్ట్ర.ఖఎ.అఅ అనే ఈమెయిల్ లేదా o91-7386965827 నంబర్ ద్వారా నిర్వాహకులను సంప్రదించవచ్చు.

**ఐఐటీ హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు**

2008లో స్థాపించబడిన ఐఐటీ హైదరాబాద్ విద్య, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, స్టార్టప్‌ల రంగాల్లో విశేష గుర్తింపు పొందింది. ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లో ఇంజినీరింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా 7వ స్థానం, ఇన్నోవేషన్ విభాగంలో 6వ స్థానం సాధించింది. పరిశోధన, పేటెంట్లు, సాంకేతిక ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహంలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

# ఉచిత పోలీసు కోచింగ్‌కు స్క్రీనింగ్ టెస్ట్

నేడు ఉదయం 10 గంటలకు పరీక్ష.. మూడు కేంద్రాల్లో నిర్వహణ · సంగారెడ్డి జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులకు మాత్రమే స్క్రీనింగ్ టెస్ట్‌కు అనుమతి

పరీక్షకు సమయానికి హాజరుకావాలన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ · ఇతర జిల్లాల అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు అందించనున్న ఉచిత కోచింగ్‌లో భాగంగా అక్టోబర్ 10న ఉదయం 10 గంటలకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పేర్లను జాబితాలో సరిచూసుకొని, కేటాయించిన పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరుకోవాలని సూచించారు.

**మూడు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు**

సంగారెడ్డి కేంద్రంగా శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో పరీక్ష నిర్వహిస్తారు. సంగారెడ్డి టౌన్, రూరల్, ఇంద్రకరణ్, సదాశివపేట, కొండాపూర్, బీడీఎల్ భానూర్, జిన్నారం, హత్నూర, గుమ్మడిదల, ఐడీఏ బొల్లారం, ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అభ్యర్థులు ఇక్కడ పరీక్షకు హాజరుకావాలి. అందోల్ కేంద్రంగా జోగిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తారు. జోగిపేట, పుల్కల్, వాటపల్లి, నారాయణఖేడ్, మనూర్, నాగల్‌గిద్ద, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అభ్యర్థులు ఈ కేంద్రానికి రావాలి. జహీరాబాద్ కేంద్రంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తారు. జహీరాబాద్ టౌన్, రూరల్, కోహీర్, చిరాగ్‌పల్లి, ఝరాసంగం, హద్నూర్, రాయికోడ్, మునిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని అభ్యర్థులు ఈ కేంద్రంలో పరీక్ష రాయాలి.

**ఆధార్, దరఖాస్తు ఫారం తప్పనిసరి**

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రాథమిక దరఖాస్తు ఫారాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని ఎస్పీ సూచించారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రానికే హాజరుకావాలని, ఉదయం 10 గంటలకు ముందుగానే అక్కడికి చేరుకోవాలని తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులకు మాత్రమే స్క్రీనింగ్ టెస్ట్‌కు అనుమతి ఉంటుందని, ఇతర జిల్లాల అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులందరూ నిబంధనలు పాటించి పరీక్షకు సమయానికి హాజరుకావాలని జిల్లా ఎస్పీ కోరారు.



# చేగువేరా ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం.. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్

### సిపిఎం తిరుమలయపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా 59 వ వర్ధంతి కార్యక్రమం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రపంచ యూత్ ఐకాన్ చేగువేరా ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, పార్టీ నాయకులకు కార్యకర్తలకు, యువతకు పిలుపునిచ్చారు. తిరుమలాయపాలెం గజ్జల వెంకటయ్య భవనంలో చేగువేరా 59వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు దాసరి మహేందర్ అధ్యక్షతన జరిగిన చేగువేరా 59వ వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని షేక్ బషీరుద్దీన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏ రాజకీయ నాయకుడికి ఏ క్రీడాకారుడికి ఏ సినిమా యాక్టర్ కి లేని గుర్తింపు చేగువేరాకు ఉందని ఆయన ఈ సందర్భంగా ఉన్నారు. ప్రపంచ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేసిన మహా విప్లవకారుడు చేగువేరా అని ఆయన అన్నారు. అందుకే చగో వీరాను ప్రపంచ దేశాల ప్రజలు గుర్తుంచుకున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశాడు. చేగువేరా త్యాగం, పోరాటపటిమా, అధ్యయనం, ఆయన ఆలోచనలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చేగువేరా లాటిన్ అమెరికా దేశాల్లో మోటార్ సైకిల్ యాత్ర చేసి ప్రజల సమస్యలను యువత విద్యార్థులు సమస్యలను తెలుసుకున్నాడని ఆయన గుర్తు చేశాడు. ప్రజల వ్యాధులు నైన్ చేయడం కోసం ఆయన డాక్టర్ గా మారారని,




సమాజ రోగాన్ని తగ్గించడం కోసం ఆయన విప్లవకరుడుగా మారారని ఆయన ఈ సందర్భంగా అన్నారు. విప్లవంలో కీలక పాత్ర పోషించిన చేగువేరా, బొలీవియా విప్లవ పోరాటంలో అసువులు బాషాడని ఆయన గుర్తు చేశాడు. చేగువేరా మరణించిన ఆమె ఆశలు మరణించలేదని, ఆయన ఆశయ సాధన కోసం అందరం ఉద్యమించాలని ఆయన సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తుళ్లూరి నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకన్న, నెరసుల వెంకటేశ్వర్లు, గుండమల్ల ఉపేందర్, కొమ్ము వెంకన్న, కొమ్ము నాగేశ్వరరావు,కొమ్ము శంకర్, అప్పారావు, ఎల్లయ్య శ్రీనివాసరావు, మల్లికార్జున్, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాదిలో 46 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం...

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** భారతదేశం 2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుండగా, దక్షిణ భారతదేశం కీలక పాత్ర పోషించనుంది. దక్షిణాదిలో ప్రస్తుతం 46 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, 2026లో 31 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని బిగ్‌మింట్ సంస్థ వెల్లడించింది. హైదరాబాద్ లో ని వెస్టిన్ హోటల్‌లో తీస్మ ఆతిథ్యంతో బిగ్‌మింట్ నిర్వహించిన 'ఫ్యూచర్.స్టీల్' 3వ ఎడిషన్ సదస్సులో ఈ విషయం చర్చకు వచ్చింది. ఫ్టీసీసీఐ , క్రీమా మద్దతు ఇవ్వగా, 17 రాష్ట్రాల నుండి 150 కంపెనీలు, 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. "ది స్ట్రక్చరల్ గ్యాప్" నివేదికను విడుదల చేశారు. సదస్సులో ఎన్ఎమ్ డీసీ డైరెక్టర్ వివేక్ నిశాంత్ నాథ్, ఎఫ్టీసీసీఐ ప్రెసిడెంట్ కె.కె. మహేశ్వరి, ఎమ్ఈ ఈఐఎల్ చీఫ్ జి.ఎల్. గుప్తా, తీస్మ సెక్రటరీ జనరల్ వినోద్ కుమార్ అగర్వాల్ తదితరులు మాట్లాడుతూ.. విద్యుత్ ఖర్చులు, లాజిస్టిక్స్,




ముడిసరుకు లభ్యత, గ్రీన్-స్టీల్, ఏఐ ఆధారిత ఉత్పత్తిపై చర్చించారు. జేఎస్డబ్ల్యూ స్టీల్, టాటా, లాయిడ్స్ మెటల్స్ వంటి దిగ్గజ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

# మున్సిపాలిటీ కార్మికుడి కి ఆర్థిక సహాయం అందజేత

### మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ కార్మికుడు మేడి శేఖర్ అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి పార్థిక దేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ దేశపాక లతా రాజేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు





# వలిగొండలో డీజిల్ దొంగ అరెస్ట్ - రూ.1.70 లక్షల నగదు, మొబైల్ స్వాధీనం

### సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రవి

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** వలిగొండలో వరుస డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాలలోని ఒకరిని వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ వివరాలను శుక్రవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. రవి విలేకరుల సమావేశంలో కేసు వెల్లడించారు. గత నెల 21 29 తేదీలలో లారీల నుండి వరుస డీజిల్ దొంగతనాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులతో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీలు చేస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున అనుమానస్పదంగా కారులో ప్రయాణిస్తున్న నేరస్తుడు సయ్యద్ సోహెల్ అలియాస్ పప్పు సోహెల్ నుఅదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని దగ్గరి నుండి రూ.1 లక్షా 70 వేల నగదు, వివోమొబైల్ ఫోన్,బెలనో కారు, ఇనుపరాడ్లు మరియు స్క్రూడ్రైవర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బేలేనో కారులో వచ్చి ఇనుపరాడ్ సహాయంతో ట్యాంక్ కు రంధ్రం చేసి డీజిల్ చోరీ చేసేవారు. ఇతనితో పాటు ఐదుగురితో టీంగా ఏర్పడి, స్క్రూల్ డ్రైవర్ల సహాయంతో రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. వలిగొండలో నేరాలకు తావులేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. నిందితున్ని పట్టుకున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని, క్రైమ్ టీం పోలీసులు నిరంజన్, సురేష్ సతీష్ లను సిఐ అభినందించారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

### ఎంజేపీటీ పాఠశాల,కళాశాలలో బతుకమ్మ పండుగ వైభవం...

### ఏటీపీలు రవికుమార్, మహేందర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం,తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ పాఠశాల, కళాశాలలో ఏటీపీలు రవికుమార్,మహేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు నేపథ్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో బతుకమ్మ వైభవ వేడుకను నిర్వహించారు. ఉపాధ్యాయినీలు బతుకమ్మను పేర్చి ఆడి పాడారు. ఈ సందర్భంగా ఏటీపీ రవికుమార్ మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతిక జీవనానికి, ఆచారాలకు, ప్రకృతి ఆరాధనకు బతుకమ్మ పండుగ ప్రధాన ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

